

# "చపలత్వమా! నీపేరే స్త్రీ!!"

అందే గోపాలకృష్ణమూర్తి

"ఏమండోయ్ గోపాలంగారూ, ఏమిటంత సీరియస్‌గా ఆలోచిస్తున్నారు. రాయబోయే కథ గురించా?" విసురుగా వస్తూనే అడిగింది శారద.

"రాయబోయే కథ గురించి కాదు, రాసేసిన కథ గురించి!" ముక్తసరిగా జవాబిచ్చేడు గోపాలం.

"అదేమిటయ్యా పెద్దమ్మ కొడుకూ, ఇట్లా నువ్వాను! ఏ రచయితైనా రాసేసి, పడిపోయిన కథ గురించి ఆలోచిస్తాడా? హవ్వ! నే నెక్కడా చూడలేదు! మా క్లాస్‌మేట్లకీ, వాళ్ళ ఫ్రెండ్స్‌కీ, హాస్టలమ్మాయిలకీ అందరికీ మా కజిను గొప్ప వర్ధమాన రచయిత, ఫలానా ఫలానా కథలు వ్రాసేడు అని నీ కెంతో పబ్లిసిటీ ఇస్తుంటే, ఇదేం రచయితవయ్యా బాబూ, రాసేసిన కథ గురించి ఆలోచిస్తున్నానంటావ్? ఏం, దాని ముగింపు ఇంకా దొరకలేదా, ఏమిటీ?...."

"కాదు, శారూ! నువ్వా కథని చదివినట్టు లేదు...."

"ఏదీ, పుస్తకం నువ్విస్తేగా...."

"బావుంది, నా కథ పడిందోయ్ అని పుస్తకం పుచ్చుకొని ఊరంతా తిరగమంటావా?....సిల్లీ...."

"పోన్లే, నిన్నంతగా ఆలోచనలో ముంచిన కథ టూకీగా చెప్పి, నీ ప్రోబ్లెం ఏమిటో చెప్పు. వీలైతే నేనూ ఆలోచిస్తా...."

"వెరీగుడ్! అయితే ఒకటి; ఈ టాపిక్ అయిపోయేంతవరకూ నువ్వూ నేనూ అన్నా చెల్లెళ్ళమవుతామనే విషయం మర్చిపోయి, ఇరవై రెండేళ్ళ-చదువుకుంటున్న అమ్మాయీ, పాతికేళ్ళ అబ్బాయీ గా మాట్లాడుకొందాం. ఇలా మాట్లాడుకొన్న విషయాలు కేవలం మన మధ్యనే ఉంటయ్. వాటి ప్రసక్తి మరెప్పుడూ మన మధ్య రాదు. సరేనా?"

"ఏమో బాబూ, నా చేత అవీ ఇవీ చెప్పించేపేటట్టున్నావ్...."

"లేదు శారూ, నువ్వేం సీక్రెట్లు

చెప్పినా నా వద్దనే ఉండిపోతయ్. అలాగే నావీనూ, ఓకే!...."

"రైట్, కానీయ్ అయితే!" అంటూ కుర్చీ లాక్కుని కూర్చుంది శారద.

"చూడు శారదా, నువ్వెవరైనా ప్రేమించేవా?...."

గోపాలం ప్రశ్న విని ఉలిక్కిపడింది శారద. "అలాంటి విల్లేయ్యకు గోపాలం మరి!...." బుంగమూతి పెట్టింది గోపాలం వైపు చూస్తూ.

"విల్లు కాదు శారూ, పోనీ, నువ్వెవరైనా గాఢంగా ప్రేమించేవనుకో...."

"అబ్బ-నా కటువంటి వ్యవహారాలసలు లేవయ్యా బాబూ!...."

"అయామ్ సారీ టు నోట్ దట్, కానీ, పోనీ అనుకో—"

"సరే—కానియ్!"

"మామూలుగా పరిస్థితుల ప్రాబల్యం వల్ల, మీ నాన్నారి పట్టుదలవల్ల నీ పెళ్ళి మరో అబ్బాయితో అయిపోతుందనుకో, అప్పుడు నిన్ను ప్రేమించిన అతను నిన్ను తల్చుకుంటూ నువ్వు లేక బ్రతకలేనని ఆత్మహత్య చేసుకుంటాడనుకో—అప్పుడు నీ కెలాగుంటుంది శారూ, కరెక్టుగా ఊహించి, నిన్ను నువ్వు ఆ స్థానంలో ఉంచుకొని, చెప్పు చూద్దాం—"

"నేనూ అతనితో బాటే చచ్చిపోతా!...." సీరియస్‌గా ఎటో చూస్తూ అన్నది శారద.

"నీ ప్రేమకూ, సిన్సియారిటీకీ నా జోహార్లు కాని, నిజంగా అలా చేయలేవ్ శారూ! ఏదో ఎమోషన్లో అలా అనేసేవ్ గాని, ఆ పరిస్థితి నీదాకా వచ్చిననాడు—రాకూడదనే నా కోరికనుకో—ఒకవేళ వస్తే నీ స్నేహితుని గురించి నిజంగానే కన్నీరు కారుస్తావ్, రెండు మూడ్రోజులు తిండీ, నిద్రా మానేసి ఆలోచిస్తావ్, ఆనక మెల్లగా అన్నీ మర్చిపోయి, నీ భర్త సమక్షంలో హాయిగా బ్రతికేస్తావ్....ప్రాక్టికల్‌గా జరిగేదిదే! ఇప్పుడు నువ్వు కాదన్నా, యదార్థంలో ముమ్మాటికీ ఇదే జరిగితీరుతుంది. నీ భర్త సమక్షంలో, నీ భర్త హోదాలో నీ పాత స్నేహితుని గురించి ఆలోచించే తీరిక కూడా కొన్నాళ్ళకు నీకు లేకుండా పోతుంది. కానీ, ప్రేమ విఫలమైనందుకు నీ స్నేహితుడు, నిన్నమితంగా ఆరాధించుకొనే స్నేహితుడు లేదా ప్రియుడు నువ్వు లేకుండా బ్రతకలేక—నూరేళ్ళ జీవితాన్ని నీ ప్రేమలో పడి—నాశనం చేసుకుంటానికి సిద్ధమౌతాడు. కాదంటావా?...."

గోపాలం మాటలు వింటూ ఆలోచుస్తూ కూర్చుండి పోయింది శారద. కాస్సేపోయాక "ఇలానూ అవ్వవచ్చు—లేదా...." అంటూ ఏదో చెప్పబోయిన శారదకు అడ్డొస్తూ, "లేదా నీ భర్తలో నీ స్నేహితుని చూసుకోవచ్చు. కానీ, అతన్ని గురించి ప్రాణత్యాగం చేయలేవు కదా? ఎందుకంటే, నీ భర్త నీకు నీడలా వుంటాడు, నీ మనసెలావున్నా అతని




సమక్షంలో క్రమేపీ అన్ని బాధలనూ మర్చిపోగల్గుతావు, సాధారణ జీవితానికి క్రమంగా ఎడ్జస్టయిపోగల్గుతావు; కానీ - అక్కడ నిన్ను ప్రేమించి పూజించుకొనే స్నేహితునికి కనీసం ఓదార్పు నిచ్చేవాళ్ళెవరైనా ఉంటారా? ఆ బలహీనమైన క్షణాల్లో అతనికి కన్పించేది ఒక్కటే! మృత్యువు! అందుకే అన్నీ మర్చిపోవాలని మృత్యువునాశ్రయించ సంసిద్ధుడౌతాడు. ఔనా?

"నువ్వు చెప్తుంటే ఔననిపిస్తుందిగాని, ఆ బలహీనమైన క్షణాలు ఆడదానికి మాత్రం ఎందుకుండవ్? ఎంతమంది భగ్న ప్రేమికురాళ్ళు ఆత్మహత్యలు చేసుకొని పండంటి జీవితాల్ని నాశనం చేసుకోలేదూ?...."

"నిజమే. మంచి ప్రశ్నే వేసేవ్. కాని చూడు శారదా, భగ్న ప్రేమికురాళ్ళు జీవితాల్ని నాశనం చేసుకొన్నారన్నావ్. బలహీనమైన క్షణాలు ఆడదానికీ ఉంటవన్నావ్. నిజమే. ఆ బలహీనమైన క్షణాల్లో ఆకర్షణ నుండి తప్పుకోలేక, ఉద్రేకానికి లొంగిపోయి, . కాలుజారి పతనమైపోవడం మూలంగా, సంఘంలో తలెత్తుకోలేక, వేరే గత్యంతరం లేక, కావాలని కోరుకోక పోయినా తప్పనిసరిగా జీవితాన్ని నాశనం చేసుకోవల్సి వస్తుంది ఆడదాని విషయంలో. అటువంటి సందర్భాలలోనే ఆడది ఆత్మహత్య చేసుకోసాహసిస్తుంది. నువ్వూ నేనూ మరెవరైనా సరే, ఆడ— ఆత్మహత్య తాలూకూ కేసులు విని ఉంటే వందకి వందా ఇంటువంటివేగాని, ప్రేమించిన అబ్బాయి దక్కక, జీవించలేక చచ్చి

పోయిన కేసులు మాత్రం కావు. మరి మగాడి విషయం తీసుకో. లవ్వెఫైర్స్ ఫెయిలయ్యి ఎంత మంది అబ్బాయిలు రైళ్ళక్రింద తల పెట్టేయలేదూ? ఎంత మంది నిద్రమాత్రలు మింగి చావలేదూ? ఇవన్నీ అడపాదడపా విన్పిస్తున్న విషయాలే కదా? అయితే, ఎన్నో ఆల్టర్నేటివ్స్ ఉండగా కూడా అబ్బాయి ప్రేమికురాలు దక్కకపోతే ప్రాణాలు తీసుకుందుకు సైతం సిద్ధపడతాడంటే మగాడి ప్రేమ తీవ్రత, సిన్సియారిటీ ఎంతటి ఉన్నతమైనవో ఆలోచించగలం కదూ? ప్రేమ సెంటిమెంటు దెబ్బతింటే మగాడు నీరైపోతాడు. మామూలు జీవితానికి ఒకపట్టాన ఎడ్జస్టవలేడు. అతని పంథాయే మారిపోతుంది. కాని ఆడపిల్ల విషయంలో అలా కాదు. జీవితంతో రాజీపడిపోగల మనసు ఆడపిల్ల కుంటుంది. ఎంత తీవ్రంగా అనుభూతుల పాలవుతుందో, అంత త్వరితంగానే వాటినుంచి పారిపోగలదు ఆడమనసు! దీనినే సెంటిమెంట్లను మార్చుకోవడం అంటారు. జాగ్రత్తగా ఆలోచిస్తే నే చెప్పింది నిజమనిపించడం లేదూ?" సీరియస్‌గా చూస్తూ అడిగాడు గోపాలం.

రెండు నిముషాలు మౌనం వహించి, ఏదో ఆలోచించి మెల్లగా అన్నది శారద. "నిజమే గోపాలం! నువ్వు చెప్పింది జాగ్రత్తగా ఆలోచిస్తే, నిజమే ననిపిస్తుంది!"

"నా ఉద్దేశం కూడా అదే. ఇదే ఉద్దేశ్యాన్ని మొన్నటి నా కథలో మూడు పాత్రల ద్వారా తెలియజేసేను. సుందరి కథానాయిక. గోపాలం ఆమెను ప్రేమిస్తాడు. ఇద్దరి మధ్యనా స్నేహం పెంపొందుతుంది. ఇదే సమయంలో మూర్తితో సుందరి వివాహం పెద్దల నిశ్చయం ప్రకారం జరిగిపోతుంది. గోపాలం విరహుడైపోతాడు. సుందరికి దూరంగానే ఉండిపోతాడు. తన మూలంగా జీవితాన్ని పాడుచేసుకుంటాడేమోనన్న భయంతో, గోపాలాన్ని మార్చేప్రయత్నం చేస్తుంది సుందరి. ఈ ప్రయత్నంలో అతనికి మరింత దగ్గరైపోతుంది. మానసికంగా కృశించిపోయినగోపాలంఊహాకీవాస్తవానికీ రాజీ కుదుర్చుకోలేక,మనసుపెట్టేచిత్రవధను భరించలేక ఆత్మహత్య చేసుకుంటాడు. ఈ విషయం చాన్నాళ్ళ తర్వాత యాదృచ్ఛికంగా భర్త ద్వారా వింటుంది సుందరి. కుమిలి కుమిలి ఏడుస్తున్న భార్యను సహృదయుడైన మూర్తి ఓదారుస్తాడు. పైగా గోపాలం తాలూకు సెంటిమెంటును అభినందిస్తూ, "రోజూ మార్చే చీరల్లాగ సెంటిమెంట్లను మార్చుకొని, దేవుడిచ్చిన భర్తతో ఎడ్జస్టయిపోగలదు ఆడది; కాని మగాడు అలా కాదు, సెంటిమెంట్ దెబ్బతింటే సగం నీరైపోతాడు, ఆత్మహత్యకు పాల్పడతాడు!" అంటూ గోపాలంపై సానుభూతి చూపెడ్తాడు. టూకీగా ఆ కథ సారాంశం అది శారూ! జీవితాంతం సుందర్ని కుమిలి కుమిలి ఏడ్చేయమని నా ఉద్దేశ్యం కాదు. ప్రేమ దెబ్బతిన్నా ఆడది

తేరుకోగలదు, కాని మగాడు జీవితాన్ని నాశనం చేసుకొంటాడు—అని ఈ 'పర్టి క్యులర్ కేసు' మనకీ కథలో తెలియ జేస్తుంది. ఇలాగని 'భగ్నప్రేమికులంతా ఛస్తున్నారా?' అంటే అదీ కాదు. వేరే విధంగా సుఖమయం చేసుకొనే మార్గా లున్నప్పటికీ మగాడు ఆ సమయంలో వాటిని గురించి ఆలోచించకుండా, ప్రేయసి గురించి ప్రాణాలర్పిస్తాడని, మనసు మార్చుకోలేడనీ చెప్పడమే ఆ కథ లక్ష్యం. అయితే చూడు...."

"చూడవల్సిందేముందీ? ఈ కథ దృష్ట్యా నీ అభిప్రాయాలతో పూర్తిగా ఏకీ భవిస్తున్నాను. నాకూ తెల్సిన ఎంతోమంది అమ్మాయిలు-నా స్నేహితురాళ్లే—ప్రేమ వ్యవహారాలు నడిపి, ఆనక పెద్దాళ్లు తెచ్చిన పెళ్ళిళ్ళు చేసుకొని, పాత గొడవలన్నీ మర్చిపోయి, హాయిగా ఉంటున్నారు. నాకు తెల్సినంతవరకూ ఒక అబ్బాయి మాత్రం సూసైడ్ చేసుకున్నాడు. ఆ అమ్మాయి ఇప్పుడు ఇద్దరు పిల్లల తల్లి! ఆఫీసరు భర్త ప్రక్కన, అతని హోదాలోనూ, అన్నీ మర్చిపోయి హాయిగా ఉంటుంది. ఇటువం టివి విన్నపుడు నిజంగా మగాడి సెంటి మెంటు ఉన్నతమైన దనిపిస్తుంది...." ఎటో చూస్తూ అన్నది శారద.

"అయితే, ఇదిగో—ఈ ఉత్తరాన్ని చూడు! నా కథను విమర్శిస్తూ ఒకానొక పాఠకురాలు వ్రాసింది. పత్రిక కార్యాలయం వారు నాకు రీ-డైరెక్టు చేసారు!" అంటూ జేబులోంచి ఓ కవరుతీసి శారద కిచ్చేడు గోపాలం. ఉత్సాహంగా కవరు విప్పి, కాగి తాల్ని జాగ్రత్తగా తీస్తూ, 'అబ్బో చాలా పెద్ద లెటరే!' అంటూ చదవడం మొదలు పెట్టింది శారద.

శ్రీ గోపాలంగార్కి,

మొన్న మీరు రాసిన కథ చదివాక ఈ లెటర్ వ్రాయకుండా ఉండలేక పోయాను.

"రోజూ మార్చే చీరల్లాగ సెంటి మెంట్లను మార్చేసుకోగలదు ఆడది. కాని మగాడి విషయంలో అది సాధ్యం కాదు-" ఇది మీకలంనుంచి వెలువడిన అమూ ల్యాభిప్రాయం!

నవ్వొచ్చింది. అదేం చిత్రమోగాని, వేదకాలంనుంచీ అణుయుగం వరకూ ఆడవాళ్ళ పట్ల మగాళ్లు పుంఖానుపుంఖా లుగా అభిప్రాయాలూ, వ్యంగ్యాలూ, ఛలో క్తులూ విసుర్తూ, వ్యక్తపరుస్తూ ఉన్నారే గాని, అవి సదరు ఆడవాళ్ళకి ఆమడదూరం లోనే ఉండిపోయాయి. ఒకటీ సహజ త్వాన్ని సంతరించుకోలేదు. 'సెంటి మెంట్లతోపాటు వ్యక్తుల్నీ మార్చేసు కుంటుంది, ఆడది, హుఁ!' అంటూ మీరు వ్రాశారు. మరొకరెవరో "స్త్రీ జీవితంలో 'ఒక్క పురుషుడినే, ప్రేమించ గలదు, చచ్చినా బ్రతికినా వాడే!" అన్నారు. మహా పతివ్రత, సతీ సీత, మనసేమందిరం అంటూ సినిమాలు తీస్తారు! అయితే ఆల యాన వెలసిన దేవత, లేకపోతే 'పంచ

లమో—నీ పేరే స్త్రీ!' వగైరాలు రాసేస్తారు- ఆర్థికబలం, అంగబలం ఉన్న పురుష శ్రేష్ఠులు. వందసార్లు మీ, మీ అభిప్రాయాలు వెలిబుచ్చుతారు, రాస్తారు, ప్రచారం చేస్తారు. అవి జీవనసత్యాలూ, ఉవాచలూ అయి కూర్చుంటాయి. వాటిని అందరూ వినాలి, నమ్మాలి,కాబోలు అనుకోవాలి. అంతేకాని, రక్తమాంసాలు, హృదయం, ఆవేగాలు, అనుభూతులు, ఔన్నత్యలోపాలు అన్నీ కలసిన మామూలు మనిషి-'ఆడది' అని ఏనాడు గ్రహిస్తారు మీరు? తనని చూసి, కోరి, తనముందు పరవశమయే మగాడికి తనని ఇచ్చుకోకుండా ఉండలేని ఆర్ద్రత, తన బలహీనత, స్త్రీగా వున్న 'లిమిటేషన్స్'ని చూసి అనుక్షణం జాగ్రత్తగా వుండాల్సిన దౌర్భాగ్యం; ఈనాము అందలం ఎక్కించిన మగాడే మర్నాడు ఏమో— "లోకంతో మనకేటికి లోలాక్షీ!" అని తీసుకెళ్ళిన వాడు "నీతో నాకేటికి లోలాక్షీ!" అని గుంపు వెచ్చదనంలో కలిసి, ముఖం తిప్పుకుంటాడు. మగాళ్ళు ఆడాళ్ళకి అన్యాయం చేసేస్తున్నారు అనడంలేదు నేను. బలహీనులకి అన్యాయాలనేవి లక్షకోణాల్నించి జరుగుతాయి. ఇక్కడ మీరు ప్రస్తావించిన సెంటిమెంట్ల విషయం. సెంటిమెంట్‌ని పట్టుకొని బ్రతుకంతా వెర్రికలల్లో మునగడమో, లేక దుష్ప్రచారం చేసుకోవడమో, కేవలం ఆడా మగా తేడా బట్టి కాదు, వ్యక్తుల స్వభావాల్ని బట్టి వుంటుంది. మనుషుల దృక్పథాల్లో తేడాను బట్టి వుంటుంది. మీ కథలో సుందరి ఏమీ పాషాణంలా ప్రవర్తించలేదు. చివర ముసల్లా గోడు పెట్టేందుకు! నన్నడిగితే మీ కథ ప్రకారం సుందరికి మూర్తీ, గోపాల్ ఇద్దరూ ఇష్టమే! ఇద్దర్నీ కావాలనుకొంది. అలా వ్రాసే ధైర్యం మీకు లేదు, రాదు. అలా వ్రాయబట్టే 'చలం' ఈ నాటికీ, ఏనాటికీ బూతు రచయితగా, అసహ్యంగా వ్రాసే కథకుడిగా మిగిలిపోయాడు. ఫ్రీ- లవ్. అర్థంలేని కామం, లాడ్జింగుల్లో దొరికే నైలాను చీరల గలగలలు ఆకలికోసం అమ్ముడు పోవడం కాదు. నిండయిన హృదయార్పణ జరిగినపుడు సెక్స్ ఓ అడ్డంకి కాదు. ఏం? సుందర్ని ఇద్దరూ పంచుకొని బ్రతుకులో మల్లెలూ, జాజులూ, పూయించుకోకూడదా? కాని, అసంభవం! మీ మగతనపు 'వేనిటీ' అహంభావం, 'ఇది నాది, నాకు అంతా నాకే కావాలి' అని. విశ్వాన్నంతా తన ఒడిలోకి తీసుకుని ఓదార్పు నివ్వగల విశాల స్త్రీ హృదయాన్నీ, శరీరాన్నీ పంజరాల్లో, బురఖాల్లో దాచిన రేకి స్వార్థం అలా జరుగనివ్వదు. కాని, అలా జరిగిననాడు ఎంత ప్రశాంతత ఉజ్జ్వలమైన మరెన్ని విషయాలు సాధించగలదు మనిషి! సుందరి తనను మాధుర్యంలో ముంచిననాడు విషాద గేయాలు మానేసి, ఎంత ఉన్నతంగానో ఎదిగి, మానవత్వపు యెల్లలు చూడగలిగి ఉండేవాడు గోపాల్. మూర్తి కూడా నింగి




నీలపు మృదుత్వాన్ని అనుభవించగల్గి ఉండేవాడు. అలా జరుగకుండా, పాతి వ్రత్యం, సంఘం, నీతి అంటూ అడ్డాలు పెట్టి, ఎముక ముక్క కోసం కొట్లాడుకునే కుక్కల్లా దెబ్బలాడుకొని, మళ్ళీ మళ్ళీ లభిస్తుందనే గ్యారంటీలేని ఈ జీవితాన్ని నాశనం చేసుకుని, చివరికో శవాన్ని మిగిల్చి 'ఇది నా స్త్రీ' అని ముద్రవేసి, సీలుచేసి, ఇంట్లోపెట్టి తాళంవేసి, 'చూశావా? ఈ సంఘం నుంచి నీకెంత రక్షణ ఇస్తున్నానో' అని రొమ్ము విరిచి, కులికి తృప్తి పడతారు.

ఈ సెక్యూరిటీ కంటె, బయట దుమ్ములో నలిగి నాశనం కావడమే వాంఛ నీయమని గ్రహిస్తుంది, హృదయం రక్తం వున్న ఏ స్త్రీ అయినా! తనలోని తల్లి కావాలనే బలీయమైన కోర్కెకి మగాణ్ణి ఆలంబనంగా చేసిన సృష్టిని నిర్లిప్తంగా భరించి, ఛీత్కారాలన్నిటినీ చిరునవ్వుతో గ్రహించి బ్రతికేస్తోంది ఆడది!

'ఏఁవిటీ సొద' అనుకుంటే, 'సెంటిమెంట్స్'ని ఆడదే కాదు, మగాడూ మార్చేసుకోగలడు. అసలు నిజానికి నీతి సూత్రాలూ, అనుభవపు విలువలూ, సెంటిమెంట్లూ అనబడేవి నిరంతరం మారుతూనే ఉంటాయి. అలా మారనినాడు, ప్రతి నిముషం మారి ఎదిగే మనస్సుని అందుకోలేక, మురుగునీటిమడుగా మారిపోతాయి. అయితే స్థిరమైన అభిమానాలూ, విలువలూ లేవా'అనొచ్చుమీరు.ఉన్నాయి!అవి మారవు!

స్థిరంగానే ఉండి రంగులు వేసుకుని, రెక్కలు తగిలించుకుంటాయి. ఇలాంటిదే ఆడ,మగ మధ్యవుండే మృదువైన ఆకర్షణ. స్థిరంగా ఉంటూనే, నిశ్చలత్వం చూపిస్తూనే ప్రవహించే నది ఈ ఆకర్షణ!

స్త్రీని దేవతనీ, రాక్షసినీ చేయకుండా మనిషిగా, నిండయిన వ్యక్తిగా చూడటం, చిత్రించడం నేర్చుకోండి. 'నీ బిడ్డకి తండ్రి ఎవరు' అన్న ప్రశ్న వెయ్యని సంఘంలో స్త్రీ ఇన్ని అడ్డదారులు, అబద్ధాలు, నటనలు ముసుగులు ఉపయోగించడం మాని, పరిపూర్ణ స్త్రీత్వాన్ని నింపుకొని, మగాడి ఎదని మీటుతుంది. అలాంటి పరిస్థితి గగనకుసుమాన్ని పొందడం లాంటి కల! అందుకని, దీన్ని దృష్టిలో ఉంచుకొని, ఆహ్లాదంగా కథలు వ్రాసే మీరు స్త్రీని ఒకే కోణంనుంచి చూస్తూ (ఈనాటి సోకాల్డ్ రచయిత్రీమణుల మల్లె కాకుండా), విసుర్లు విసుర్తూ జనరలైజేషన్ చేయడం మానండి. హృదయానికీ, నిస్సహాయత్వానికీ మధ్యపడి నలిగిపోతున్న ఆధునిక స్త్రీల వేదన; గుండెనిండా అభిమానం, ఆత్మగౌరవం నింపుకుని, హిమాలయాల మీద ప్రతిఫలించే వెన్నెల కిరణాల్లాంటి ఆడవాళ్ళు తమ అభిమాన గౌరవాలు భంగపడుతోంటే మౌనంగా భరిస్తున్న 'మూగబాధ'ని; తాము నిర్మించిన నీతి గొలుసులే తమని బిగించి, తమ పురుషత్వపు అహంకారమే తమను అనుకంపనతో కూడిన చూపుకి సుదూరంగా నిలబెడుతుంటే, బలమయిన మగాడి వ్యథ—వీటిని విపులంగా చిత్రీకరించండి.

"చపలత్వమా నీ పేరే స్త్రీ!" అని కాకుండా, "మానవ ప్రకృతీ, నీ పేరే చపలత్వం!" అని మార్చి, తిరిగి వ్రాయండి.


సుదీర్ఘమైన ఈ లేఖను చదివినందుకు ధన్యవాదాలు. మీ కలం నుంచి చాలా కథలు వ్యాసాలూ బ్రతుకుని దగ్గరగా, హృద్యమంగా చూపించేవి రావాలని కోరుతూ—

'ఒక పాఠకురాలు.'

**N. B:** ఇన్ని పేజీలు వ్రాసీ, పేరు వ్రాయలేని పిరికితనం-దీన్నిబట్టి తెలియడంలేదూ బ్రతుకు నెంతెలా సంకెళ్ళల్లో బంధించారో! ఈ అభ్యంతరాల్నీ, తెరల్నీ తొలగించుకొని కాంతినింపుకొన్న కళ్ళతో ప్రపంచాన్ని చూసే స్త్రీలను తయారు చెయ్యాలిగాని, రచయితలు వారిపై మరిన్ని ముసుగులు వేయకూడదు. సెలవు."

ఉత్తరం చదవడం పూర్తిచేసి "సెభాష్, చాలా బాగా రాసింది గోపాలం! రియల్లీ ఐ ఎడ్మైర్ హెర్! నిజమే! ఈ ఉత్తరంలో ప్రతి అక్షరం నిజం! తు. చ. తప్పకుండా ప్రతి అభిప్రాయంతోనూ నేనూ ఏకీభవిస్తాను. వండ్రఫుల్, ఈవిడెవరో నిజంగా అభినందించాలి"—అంటూ అదేపనిగా మాట్లాడింది శారద.

"శారూ! చూడు, నువ్వు చదువుకున్న దానివీ, వయసులో వున్నదానివీ గదూ? నీ అభిప్రాయాలకు నేను తప్పకుండా విలువిస్తాను. నేనే కాదు, నీ వయసులో వున్న విద్యావంతులైన యువతీ సంఘానికి ప్రతి




నిధివి నువ్వు గనుక నీ ఉద్దేశ్యానికి ఎవరైనా విలువిస్తారు. సరే, ఇందాక ఈ ఉత్తరం చదవకముందు ఆడా, మగా, సెంటిమెంట్ల విషయంలో నువ్వు పూర్తిగా నా అభిప్రాయంతో ఏకీభవించేవు. ఔనా? మళ్ళీ వెంటనే ఈ ఉత్తరం చూడగానే అభిప్రాయం మార్చేసుకున్నావ్. అంటే, ముందు నా ప్రభావం నీ మీద పనిచేసింది. తర్వాత ఈ ఉత్తరం వ్రాసిన పాఠకురాలి ప్రభావం అంతకంటే ఎక్కువగా పని చేసింది. ఔనా! ఈ రెండింటికంటే రేపు నీ భర్త అనేవాడి ప్రభావం యింకా ఎక్కువుగా వుంటుంది నీమీద. అతని సమక్షంలో పాత అభిప్రాయాలూ, పాత భావాలూ, బాధలూ, పాత సెంటిమెంట్లు ఇట్టే మార్చేసుకోగలవ్, మర్చిపోగలవ్. నువ్వేకాదు నీ లాంటి చాలామంది అంతే! 'భర్త' అనే ఒక మహత్తరమైన వ్యక్తి ప్రభావానికి లోనై ఎంతటి స్త్రీ అయినా ఎటువంటి కష్టాన్నైనా ఇట్టే మర్చిపోయి, ఎడ్జస్టయిపోగలదు. మరో మాటల్లో, నే చెప్పిందీ అదే! ఇదే విషయాన్ని ప్రత్యక్షంగా 'నీ అభిప్రాయాల'తో కూడా ఎక్స్‌పెరిమెంట్ చేసి ఔనని రుజువు చేశాను. బోధపడకపోతే సావకాశంగా ఆలోచించుకో!" అంటూ బైటకు వెళ్ళిపోయాడు గోపాలం.

గోపాలం మాటలను మళ్ళీ మళ్ళీ నెమరువేసుకుంటూ, ఏదో కొత్త సత్యాన్ని అనుభవపూర్వకంగా తెల్సుకొన్నట్టు ఫీలవుతూ, అలాగే కూర్చుండి పోయింది శారద.